క్లుప్తంగా

29న జగనన్నకు చెబుదాం

సంతమాగులూరు (అద్దంకి): కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఈ నెల 29వ తేదీన ఉదయం 9 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ గ్రామంలో దండోరా వేయించి ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు.

వైఎస్సార్ పోషణ కిట్లతో మేలు

చీరాల టౌన్: గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మీ అన్నారు. మంగళవారం మండలంలోని తోటవారిపాలెం గ్రామ పంచాయతీలో ఉన్న గర్భిణులు, బాలింతలకు 29 మందికి వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

నేడు మినీ జాబ్ మేళా

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం గ్రామంలోని ఎస్‌కెబీఎం ఐటీఐ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజీ ఒక ప్రకటనలో తెలిపారు. మినీ జాబ్ మేళాకు ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నాయని ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లమో, బీటెక్ చదివి 28 ఏళ్లలోపు వయస్సు ఉన్న తగిన ధ్రువీకరణ పత్రాలతో జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు 99888 53335, 79814 44377 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. నిరుద్యోగులు జాబ్ మేళాను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మర్రిచెట్టు నరికివేతపై ఫిర్యాదు

చీరాల: వేటపాలెం మండలం కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలో వంద సంవత్సరాల చరిత్ర గల పెద్ద మర్రిచెట్టును గుర్తుతెలియని వ్యక్తులు నరివేయడంపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ చుండూరి వాసు మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర గల మర్రిచెట్టు వద్ద కరెంటు లేని రోజుల నుంచి నేటి వరకు కర్మకాండలు, క్రతువులు కులాలకు అతీతంగా నిర్వహిస్తుంటారన్నారు. ఈనెల 17న గుర్తుతెలియని వ్యక్తులు ఆ మర్రిచెట్టును నరికివేశారన్నారు. ఎవరికి తెలియకుండా వందల సంవత్సరాల చరిత్ర గల చెట్టును నరికివేయడంపై గ్రామస్తులు టూటౌన్ సీఐ జి.సోమశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. అలానే ఘటనా స్థలానికి వచ్చి ఆయన పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంతో మందికి ఉపయోగపడిన మర్రిచెట్టును కొంత మంది దుండగులు, రియల్ ఎస్టేట్ వాళ్లు కుమ్మక్కై చెట్టును నరికివేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ మేలు


సర్వేలో పాల్గొన్న ఎంపీడీవో విజయలక్ష్మి

కారంచేడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని ఎంపీడీవో డీ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని కొడవలివారిపాలెం, తిమిడెదపాడు గ్రామాల్లో జరుగుతున్న డోర్ టూ డోర్ సర్వేను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామంలోని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు సంయుక్తంగా సర్వేలు నిర్వహిస్తారన్నారు. ఈసర్వేలో ప్రతి ఇంటిలోని సభ్యుల ఆరోగ్య వివరాలను నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.


బల్లికురవ: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో గ్రామాల వారీగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ కోరారు. మంగళవారం మల్లాయపాలెం గ్రామంలో జరుగుతున్న ఇంటింటా సర్వేను ఆయన పరిశీలించారు.


మల్లాయపాలెంలో జరుగుతున్న సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారి

ఇన్వర్టర్ బహూకరణ

అద్దంకి: శింగరకొండ దేవస్థాన క్షేత్రాధిపతి లక్ష్మీ నరసింహస్వామికి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిన సమయంలో ఇబ్బంది లేకుండా ఉండేందుకు దాత ఇన్వర్టర్‌ను బహూకరించారు. రూ.20 వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను పట్టణానికి చెందిన చింత హర్షవర్ధన్‌రెడ్డి దేవస్థాన చైర్మన్ నర్రావుల కొండలుకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కోటిరెడ్డి, దాత పాల్గొన్నారు.


ఇన్వర్టర్‌ను అందిస్తున్న దాత


వేటపాలెంలో కొలువై ఉన్న గణనాథుడు


అమరావారివీధిలో నెమలి పింఛాలతో గణనాథుడు


చీరాల ఎంజీసీ మార్కెట్‌లో కొబ్బరికాయలతో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమ


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో బొజ్జ గణపయ్య

గణపతి బొప్పా మోరియా

- ఘనంగా ప్రారంభమైన వినాయక చవితి
- సందడి చేసిన యువత, చిన్నారులు
- మట్టి విగ్రహాలకు అధిక ప్రాధాన్యత

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: తల్లి రక్షణకు ప్రాణమిచ్చిన మాతృవాక్పరిపాలకుడు.. ఏకదంతుడు.. పార్వతీ తనయుడు, విఘ్నాలు తొలగించే వినాయక చవితి పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. సోమవారం అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఉదయం నుంచి ప్రత్యేక పందిళ్లలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. మండలంలోని కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ, దగ్గుబాడు, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, ఆదిపూడి, తిమిడెదపాడు, జరుబులవారిపాలెం, యర్రంవారిపాలెం, నాయుడువారిపాలెం గ్రామాల్లోని వినాయక విగ్రహాలను పోటాపోటీగా నెలకొల్పారు. గ్రామంలోని కాలువ సెంటర్, యజ్ఞశాలపేట, స్టేట్‌బ్యాంక్ ఎదురు వీధి, మాస్కో బజారు, మధ్య బస్టాండు, బండెలదొడ్డి, రామాలయం బజారు, కట్టమీద, ఉప్పరపాలెం ప్రాంతాలలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు.

- యద్దనపూడి మండలంలోని ప్రజలు వినాయక చవితిని ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి గ్రామంలోని ఆయా వీధుల్లో ప్రత్యేకంగా రూపొందించిన మండపాల్లో గణనాథుడిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మార్టూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మహిళలచే నిర్వహించిన కోలాట ప్రదర్శన చూపరులను అలరించింది.
- చినగంజాం మండలంలోని 12 పంచాయతీల్లోని అన్ని గ్రామాల్లో ప్రజలు తమ గృహాలతో పాటు ఆయా వీధుల్లో సామూహిక వినాయక పందిరిలు ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెదగంజాం, రాజుబంగారుపాలెం, మున్నం వారిపాలెం, కొత్తపాలెం, పల్లెపాలెం, గొనసపూడి, సంతరావూరు, కడవకుదురు, చినగంజాం తదితర గ్రామాల్లో పండుగ ఉత్సవాలు నిర్వహించారు.
- ఇంకొల్లులోని రామ మందిరం, చెరువు కట్ట, తటాక ఆంజనేయస్వామి వంటి ప్రధాన ఆలయాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందుకున్నారు.
- పర్చూరులో జయంతి కాలనీ, తూర్పు బజార్, మధ్య బజార్, టీ నగర్, అద్దంకి మాన్యం, వాటర్ ప్లాంట్ బజార్ తదితర ప్రదేశాల్లో 8 అడుగులు నుంచి 12 అడుగుల వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు.


మార్టూరు బలరామ్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం


రాజుబంగారుపాలెం పూజల్లో పాల్గొన్న యువకులు


ఇంకొల్లులో భక్తులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం


పందిళ్లపల్లిలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం


పంగులూరులో పొట్టేళ్ల బండితో వినాయకుడిని ఊరేగిస్తున్న గ్రామస్తులు


రోటరీ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న సభ్యులు

గణనాథా నమోస్తుతే..

చీరాల/వేటపాలెం/చీరాల అర్బన్/చీరాల రూరల్/చీరాల టౌన్: వినాయక చవితి వేడుకలను చీరాల, వేటపాలెంలో ఘనంగా నిర్వహించుకున్నారు. చీరాల ఎంజీసీ మార్కెట్, కామధేను మార్కెట్, ఆర్ఆర్ రోడ్, ఏఆర్ రోడ్, ముక్కోణం పార్కు సెంటర్, వైకుంఠపురం గేటు సెంటర్, విఠల్‌నగర్, హరిప్రసాద్ నగర్, వైకుంఠపురం, అమరావారివీధి, ముత్యాలపేట, బెస్తపాలెం, జక్కావారి వీధి, పేరాలలోని పలు ప్రాంతాల్లో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహించారు. వినాయకుడికి ప్రీతికరమైన ఉండ్రాళ్లు, పాయసం, పత్రితో ప్రత్యేక పూజలు చేశారు. చీరాలలోని ఎంజీసీ మార్కెట్‌లో కొబ్బరికాయలతో తయారు చేసిన భారీ వినాయకుడి విగ్రహం అందరికి ఆకర్షించింది. అలానే పలు ప్రాంతాల్లో పర్యావరణానికి హితమైన మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 1000 మట్టి వినాయక ప్రతిమలను, 1000 వ్రత కల్ప పుస్తకాలను పంపిణీ చేశారు. అలానే కొత్తపేటలోని ఓంకార క్షేత్రంలో మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

- పందిళ్లపల్లిలోని పోతురాజు స్వామి ప్రాంగణలో విఘ్నేశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. వేటపాలెం గడియార స్తంభం సెంటర్‌లో, రైల్వే స్టేషన్‌రోడ్డులో ప్రతివీధిలో గణనాథుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- అమరావారివీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమకు నెమలి పింఛాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. వినాయక చవితి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి..

జే.పంగులూరు/అద్దంకి/అద్దంకి రూరల్/బల్లికురవ/మేదరమెట్ల: అద్దంకి నియోజకవర్గంలో వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో జరపుకున్నారు. చవితి సందర్భంగా వినాయకుడి విగ్రహన్ని మేళ తాళలతో, డీజే సౌండ్ల మధ్య ఊరేగించి మండపంలో ప్రతిష్ఠించారు. జే.పంగులూరు మండలంలో మొత్తం 40 విగ్రహాలకు అనుమతి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పంగులూరులో చిన్నపాటి ఎడ్లబండిపై, పొట్టేలు లాగుతూ వినాయకుడి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- మేదరమెట్ల తూర్పుపాలెం అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని అందరూ బాగుండాలని వినాయకుని కోరుకున్నారు.
- బల్లికురవలో వినాయక చవితి సందర్భంగా రాత్రిళ్లు భజనలు సంస్కృతిక కార్యాక్రమాలు, కొన్ని గ్రామాల్లో నవరాత్రులు నిర్వహించేందుకు కమిటీలు సమాయత్తం అవుతున్నారు. కొమ్మినేని వారిపాలెంలో నేటి బ్రదర్స్ యూత్ ఆధ్వర్యంలో పదేళ్లుగా వేడుకలు కొనసాగిస్తున్నారు.


పూనూరులో పూజలు అందుకుంటున్న గణపయ్య


చీరాల పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి నమస్కరిస్తున్న యువత


చీరాలలో పూజలు చేస్తున్న భక్తులు


మేదరమెట్ల తూర్పుపాలెంలో పూజల్లో పాల్గొన్న భద్రారెడ్డి


అద్దంకిలో పూజలు అందుకుంటున్న గణనాథుడు


పర్చూరు జయంతి పేటలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కేపీ పాలెంలో పూజలు అందుకుంటున్న గణనాథుడు

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు

చీరాల అర్బన్: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 29 వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా సేవాదళ్ కో-ఆర్డినేటర్ ముంగర రాంబాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సత్యసాయి సేవా సంస్థల సేవలు అభినందనీయమన్నారు. రాంబాబు మాట్లాడుతూ వ్యాసరచనలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులకు 'మానవత్వాన్ని పెంపొందించే విద్యావశ్యకత', ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులకు 'ప్రకృతియే ఉత్తమ గురువు', 8వ తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు 'ఆచార్య దేవోభవ' అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. వ్యాసరచన తెలుగు, ఇంగ్లిషు మీడియంలో అనుమతిస్తున్నామన్నారు. సమితి స్థాయిలో, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి మొదటి, రెండు, మూడో స్థానాలు సాధించిన వారికి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 99496 16919 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు భానుచంద్రమూర్తి, ఎంఈఓ-2 సుధా రాణి, సీఆర్పీలు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

మంచినీటి బావికి మరమ్మతులు

జే.పంగులూరు: ఒకప్పుడు గ్రామం మొత్తం అందించిన బావి పాడుబడి ఉండడంతో ఆ బావిని మరమ్మతులు చేసి రోటరీ క్లబ్ మళ్లీ వాడకంలోకి తెచ్చింది. మండల పరిధిలోని పంగులూరు గ్రామంలోని పోలేరమ్మ గుడి వద్ద ఉన్న మంచినీటి బావి ఒకప్పుడు పంగులూరు గ్రామం మొత్తానికి దాహాన్ని తీర్చేది. 1941లో అప్పటి పంగులూరు గ్రామ పెద్దలు బాచిన వీరరాఘవయ్య, రావూరి బల్లెయ్య బావిని తవ్వించారు. అప్పటి నుంచి చాలా కాలం వరకు ఈ బావి నుంచి గ్రామస్తులు మంచినీళ్లకు వాడుకునేవారు. కాలక్రమేణ బావి వాడకం తగ్గిపోయింది. రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు రోటరీ గంగ ద్వారా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి, గ్రామస్తులకు అతి తక్కువగా నాణ్యమైన మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నారు. బావి ఒడ్డును మెటల్ వేసి మరమ్మతులు చేశారు. క్లబ్ సమారు రూ. 60 వేల వ్యయంతో మరమ్మతులు చేశారు. 8 దశాబ్దాల చరిత్ర గల బావి పాడుబడి పోవడం ఇష్టం లేక దానిని రోటరీ గంగ ద్వారా గ్రామ ప్రజలందరికీ మంచి నీటిని అందించేందుకు తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు క్లబ్ అధ్యక్షుడు కరణం హనుమంతురావు, రోటరీ క్యాంపు కన్వీనర్ సీ వీరరాఘవయ్య, కోశాధికారి జీ ఆంజనేయులు తెలిపారు.


మరమ్మతులు చేసిన మంచినీటి బావి

ఉపకార వేతనాలు విద్యకు దోహదం

చీరాల టౌన్: నాయీబ్రాహ్మణ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నతస్థాయికి ఎదగాలనే లక్ష్యంతోనే ఏపీ నాయీబ్రాహ్మణ ఉద్యోగ, సాంస్కృతిక సంఘం పనిచేస్తుందని నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు డాక్టర్ గుంటుపల్లి హైమా సుబ్బారావు, తాడివలస దేవరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో ఉన్న హైమా హాస్పిటల్‌లో నాయీబ్రాహ్మణ విద్యార్థులు, క్రీడాకారులు, దివ్యాంగులకు ఆ సంఘ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. నియోజకవర్గానికి సంబంధించిన దరఖాస్తు ఫారాలను సుబ్బారావు, దేవరాజ్‌లకు అందించారు. ఈనెల 24న ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో 200 మందికి ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నాదెండ్ల రాఘవ, పి.మధుబాబు, ఎ.వంకటేశ్వర్లు, వెంకట రామారావు, వెంకటరావు తదితరులు ఉన్నారు.


దరఖాస్తులను అందజేస్తున్న ప్రతినిధులు

చంద్రబాబు అరెస్టుపై టీడీపీ గగ్గోలు సరికాదు


శామ్యూల్ మోజెస్

చీరాల రూరల్: చంద్రబాబు అరెస్టు విషయంలో టీడీపీ గగ్గోలు పెట్టడం తగదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నీలం శామ్యూల్ మోజెస్ అన్నారు. మంగళవారం స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ కమ్యూనిటీ హాలులో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కూడా చంద్రబాబుకు అనుకూలంగా బంధుత్వంతో మాట్లాడుతుందా.. బీజేపీ రాష్ట్ర హోదాతో మాట్లాడుతుందా ఆమె వివరణ ఉందా చెప్పాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో వైఎస్సార్ సీపీ హస్తం ఉందని టీడీపీ వారు చేస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి చంద్రబాబును కక్షపూరితంగా అరెస్టు చేయించాడనంలో ఎలాంటి వాస్తవికత లేదన్నారు. అయితే టీడీపీ, వారికి అనుకూలంగా ఉన్నవారితో ధర్నాలు చేయిస్తు కాలం గడుపుతున్నదని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవికతను గుర్తించి చంద్రబాబు చేస్తున్న అరాచకాలకు చమరగీతం పాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట దేట దివాకర్, ఇతర కార్యకర్తలు ఉన్నారు.


అర్హులకు సంక్షేమం అందించిన ఘనత జగనన్నదే


మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంతి జగనన్నదేనని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం మణికేశ్వరం గ్రామ సచివాలయ పరిధిలోని కొంగపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా కృష్ణచైతన్య గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సాంకేతిక లోపాలతో పథకాలు అందనివారు సరిచేయించుకుని మరలా పథకాలు పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు , పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, నిజ శ్రావణ మాసం, విశాఖ నక్షత్రం పంచమి తిథి, సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోష కాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

స్వచ్ఛతాహీ సేవా విజయవంతం చేయాలి

ఒంగోలు సబర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. కరవది డొంకలో జరుగుతున్న పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 2వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రయాణ ప్రాంగణాలు, శ్రమదాన్ ద్వారా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కంటోన్మెంట్ బోర్డులు, బీచ్‌లు, పర్యాటక కేంద్రాలు, జంతు ప్రదర్శన శాలలు, పార్కులు, అభయారణ్యాలు, చారిత్రక స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు, రివర్ ఫ్రంట్‌లు, ఘాట్‌లు, డ్రెయిన్లు ఇలా అన్ని పరిశుభ్రం చేయాలని పిలుపునిచ్చారు.